క్లుప్తంగా

మర్యాదపూర్వకంగా..



వైవీ సుబ్బారెడ్డికి పుష్పగుచ్ఛం ఇస్తున్న చలపతిరావు

కొడవలూరు: రాజ్యసభ సభ్యుడు, టీటీడీ మాజీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డిని ఒంగోలులోని ఆయన నివాసంలో వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి వీరి చలపతిరావు ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. పార్టీ భవిష్యత్ ప్రణాళికలపై చర్చించారు.

చట్టాలపై అవగాహన అవసరం



అవగాహన కల్పిస్తున్న పోలీసు అధికారులు

నెల్లూరు సిటీ: మానవ అక్రమరవాణా, బాల్య వివాహాలు, బాలలను పనిలో పెట్టుకోవడం వంటివి చట్టరీత్యా నేరమని, ప్రతిఒక్కరూ చట్టాలపై అవగాహన పెంచుకోవాలని యాంటీ హ్యూమన్ ట్రాఫిక్ యూనిట్ (ఏహెచ్‌టీయూ) ఏఎస్సై శ్రీహరి అన్నారు. రూరల్ మండలంలోని దొంతాలి గ్రామంలో నాంచారమ్మ కాలనీ వాసులకు ఆదివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎవరైనా బాల్య వివాహాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. బాలికల భద్రత, మహిళల రక్షణే లక్ష్యంగా పోలీస్ శాఖ పనిచేస్తుందన్నారు. బాలికల పట్ల అగౌరవంగా ప్రవర్తిస్తే పోక్సో యాక్ట్, జువైనెల్ జస్టిస్ యాక్ట్ ద్వారా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. బాల బాలికలు, మహిళలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ఏహెచ్‌టీయూ ఏఎస్సై సతీష్, టీపీఎస్ రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

సరస్వతీ నగర్‌లో ఉచిత వైద్యశిబిరం

నెల్లూరు(అర్బన్): నగరంలోని సరస్వతీ నగర్‌లో చెన్నై హాస్పిటల్స్ ఇన్ఫర్మేషన్ సెంటర్ ఆధ్వర్యంలో నూతనంగా ప్రారంభించిన చెన్నై హాస్పిటల్ పాలి క్లినిక్‌లో ఆదివారం ఉచిత వైద్యశిబిరం జరిగింది. కార్యక్రమాన్ని రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం షుగర్, బీపీ, ఈసీజీ, ఎకో లాంటి పరీక్షలను ఉచితంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఆస్పత్రి అధినేత ఎస్వీ రమేష్‌బాబు, సిబ్బంది పాల్గొన్నారు.

శిక్షణా తరగతుల పరిశీలన

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): నగరంలోని ఎంజీబీ మాల్‌లో రాష్ట్ర చెస్ అసోసియేషన్, శ్రీఆనంద్ చెస్ వింగ్స్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత శిక్షణ తరగతులను అంతర్జాతీయ ఆర్బిటర్, అనంతపురానికి చెందిన కోచ్ పఠాన్ హుస్సేన్‌ఖాన్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంజీబీ మాల్ వ్యవస్థాపకుడు ఎంఆర్ గంగాధర్ మాట్లాడుతూ బాలల్లో విశ్లేషణాత్మక, తార్కిక నైపుణ్యం పెంపొందించేందుకు చెస్ ఉపయోగపడుతుందన్నారు.

హామీలను అమలు చేయాలి

నెల్లూరు(వీఆర్సీసెంటర్): కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీలను వెంటనే అమలు చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి దామా అంకయ్య అన్నారు. నగరంలోని సంతపేటలో ఉన్న పార్టీ కార్యాలయంలో ఆదివారం విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, గత ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు కూటమి ప్రభుత్వం పేదలకు ఇళ్ల స్థలాలు, ఇంటి నిర్మాణాలను రూ.5 లక్షల నగదు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ క్రమంలో సీపీఐ ఆధ్వర్యంలో జూన్ 2న కలెక్టరేట్ వద్ద నిర్వహించే ధర్నాలో ప్రజలు పాల్గొని, విజయవంతం చేయాలని కోరారు. అనంతరం పోస్టర్‌ను విడుదల చేశారు. వివిధ పార్టీల నేతలు సిరాజ్, షాన్‌వాజ్, నందిపోగు రమణయ్య, సురేష్, కొండలరావు, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

కళాకారులను ప్రోత్సహించాలి



నెల్లూరు(బృందావనం): కళలు, కళాకారులను ప్రోత్సహించాలని కేతా అంకులు మెమోరియల్ ట్రస్ట్ అధ్యక్షుడు కేతా సుబ్బారావు తెలిపారు. పురమందిరంలో కేతా అంకులు మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శుభమస్తు షాపింగ్‌మాల్ అధినేత బయ్యా వెంకటరమణయ్య జయంతి వేడుకలను ఆదివారం నిర్వహించారు. తొలుత వెంకటరమణయ్య చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం కళారంగానికి ఆయన అందించిన సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా పాటలు, డ్యాన్స్ పోటీల విజేతలకు ప్రోత్సాహక నగదు బహుమతులు, జ్ఞాపికలు అందజేశారు. సాంస్కృతిక కార్యక్రమాలు, సంగీత విభావరి అలరించింది. కార్యక్రమంలో నాగిశెట్టి రమణయ్య ఎ.జయప్రకాష్, అబ్దుల్, రఘురామిరెడ్డి, మల్లికార్జున, గోవర్ధన్, ఒరుగంటి సత్యనారాయణ శర్మ, మల్లీశ్వరి పాల్గొన్నారు.

ప్రయాణం.. ప్రమాదభరితం

- డేంజర్‌గా మారిన వంతెనలు
- దెబ్బతిన్న రక్షణ గోడలు
- భారీ ఇసుక లారీల రాకపోకలు
- పట్టించుకోని అధికారులు

పొదలకూరు: వాహనాలను ఏ మాత్రం ఆదమరిచి నడిపినా, కనుపూరు లేదా నెల్లూరు కాలువల్లో తేలాల్సిన పరిస్థితి నెలకొంది. మట్టి కొట్టుకుపోయిన ఇరుకైన రోడ్లు, శిథిలావస్థకు చేరిన వంతెనలపై రాకపోకలు ప్రమాదభరితంగా మారాయి. రాత్రి వేళ ఈ మార్గం మీదుగా వెళ్లాలంటేనే కొత్తవారు హడలిపోతున్నారు. దశాబ్దాలు గడుస్తున్నా, ఇక్కడ మరమ్మతులు చేపట్టేవారు కరువయ్యారని చుట్టుపక్కల గ్రామస్తులు పేర్కొంటున్నారు.

నిరంతరం ఇబ్బందే..

సంగం – సూరాయపాళేనికి వెళ్లే లష్కర్ల క్వార్టర్స్ వద్ద కనుపూరు, నెల్లూరు కాలువపై వంతెనలను దశాబ్దాల క్రితం నిర్మించారు. ఇక్కడి నుంచే కాలువలకు నీటిని విడుదల చేస్తుంటారు. అప్పట్లో ఈ వంతెనలు వెడల్పు లేకుండా మలుపులతో ఉండటంతో బస్సులు వెళ్లాలన్నా ఇబ్బందులు పడాల్సి వచ్చేది. ద్విచక్రవాహనంపై సైతం జాగ్రత్తగా వెళ్లాల్సి ఉంటుంది. ఆదమరిచి వాహనాలను నడిపితే ఘోరప్రమాదం సంభవించే అవకాశం ఉంది. దుమ్ముతో నిండి ఉండే రోడ్లపై నిత్యం వందల సంఖ్యలో వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. సంగం నుంచి సూరాయపాళెం, మాముడూరు, చేజర్ల, విరువూరు, పొదలకూరు తదితర ప్రాంతాల నుంచి ఇదే మార్గంలో వాహనాలు వెళ్తుంటాయి.



వంతెనపై ఏర్పడిన రంధ్రం

కూలిన గేట్ల రక్షణ గోడలు

ఇక్కడ తరచూ ప్రమాదాలు సంభవిస్తుండటంతో కనుపూరు కాలువకు నీటిని విడుదల చేసే గేట్ల రక్షణ గోడలు పాక్షికంగా కూలిపోయాయి. సూరాయపాళేనికి వెళ్లే మార్గంలో మలుపు ఉండటంతో తెలియని వారు గేట్ల రక్షణ గోడలను ఢీకొన్న ఘటనలూ చోటుచేసుకుంటున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు చర్యలు చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ఇసుక లారీలతో..

లష్కర్ల క్వార్టర్స్ వద్ద సూరాయపాళెం – 2 రీచ్‌ను ఏర్పాటు చేసి ఇసుకను ఇష్టానుసారంగా తరలిస్తున్నారు. భారీ లారీలు, టిప్పర్లు దీని మీదుగా వెళ్తుండటంతో ఎప్పుడు ఏ ప్రమాదం సంభవిస్తుందోనని చుట్టుపక్కల గ్రామస్తులు భయపడుతున్నారు. కనీసం హెచ్చరిక బోర్డులను సైతం ఏర్పాటు చేయకపోవడం గమనార్హం.



దెబ్బతిన్న కనుపూరు కాలువ గేట్ల రక్షణ గోడలు



ప్రమాదకర మలుపు

తేలికపాటి వర్షం

పొదలకూరు: పట్టణంలో తేలికపాటి వర్షం ఆదివారం కురిసింది. ఒక్కసారిగా ఆకాశం మేఘావృతమై ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం పడింది. పిడుగుల శబ్దంతో పొలాల్లో ఉన్న రైతులు, కూలీలు భయభ్రాంతులకు గురయ్యారు.

వ్యక్తిపై దాడి

వెంకటాచలం: నివాసం వద్ద ఉన్న ఇసుకను తొలగించే విషయంలో మండలంలోని కనుపూరుకు చెందిన రవిపై అదే గ్రామానికి చెందిన సత్యం దాడి చేశారు. ఘటనపై పోలీసులకు బాధితుడి తల్లి సుబ్బమ్మ ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఉచిత నేత్ర పరీక్షలు



పొదలకూరు: పట్టణంలోని విజేత స్కూల్లో ఉచిత నేత్ర వైద్య శిబిరాన్ని పెళ్లకూరు చాగణం లలితమ్మ, భాస్కర్‌రావు మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో తిరుపతి వెంకటేశ్వర అరవింద నేత్రాలయం వారు ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా 250 మందికి నేత్ర పరీక్షలను డాక్టర్లు మేఘన, ఆకాంక్ష జరిపారు. 70 మందికి శస్త్రచికిత్సలు అవసరమని గుర్తించారు. వారి సమ్మతితో భోజన, ప్రయాణ ఖర్చులను భరించి శస్త్రచికిత్సలను ఉచితంగా నిర్వహించనున్నామని వివరించారు. 50 మందికి మందులు, 40 మందికి కళ్లద్దాలను అందజేశారు. మేనేజింగ్ ట్రస్టీ చాగణం గౌరీశంకర్, సీఈఓ సీతారామనాయుడు, కరస్పాండెంట్ కామాక్షి, ఏఓ కృష్ణ, దిలీప్ తదితరులు పాల్గొన్నారు.

వారాంతాల్లో లీగల్ సెల్ సేవలు



మాట్లాడుతున్న అనూప్‌కుమార్‌రెడ్డి, పక్కన లీగల్ సెల్ నాయకులు

కోవూరు: స్థానిక పాటూరు రోడ్డులో ఉన్న వైఎస్సార్‌సీపీ మండల కార్యాలయంలో ప్రతి శనివారం, ఆదివారం లీగల్ సెల్‌కు సంబంధించిన న్యాయవాదులు అందుబాటులో ఉంటారని పార్టీ మండలాధ్యక్షుడు అత్తిపల్లి అనూప్‌కుమార్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కూటమి ప్రభుత్వం పాలనను గాలికి వదిలేసి కేవలం వైఎస్సార్‌సీపీ నాయకుల మీద కేసులు పెట్టడమే పరమావధిగా పెట్టుకున్నారన్నారు. సూపర్ సిక్స్ హామీలను అమలు చేసిన పాపాన పోలేదన్నారు. గత వైఎస్సార్‌సీపీ పాలనలో రైతుల నుంచి చిన్నారులు, మహిళల వరకు అనేక సంక్షేమ పథకాలను అమలు చేసినట్లు వివరించారు. ప్రస్తుత ప్రభుత్వం ఏర్పడి 11 నెలలు దాటినా తల్లికి వందనం, రైతు భరోసా, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, నిరుద్యోగ భృతి వంటి అనేక పథకాల గురించి పట్టించుకోవడం లేదన్నారు. దీంతో ప్రజలకు కూటమి ప్రభుత్వం మీద ఉన్న ఆశలు అడియాశలు అయ్యాయన్నారు. రానున్న రోజుల్లో మరలా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. అనంతరం లీగల్ సెల్ నేతలు మాట్లాడుతూ తాము అధికారంలోకి వస్తే విద్యుత్ చార్జీలను పెంచమని చెప్పిన కూటమి ప్రభుత్వం, ప్రస్తుతం ఇష్టానుసారం చార్జీలు పెంచడం వల్ల పేద మధ్య తరగతి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. రాష్ట్రంలో శాంతి భద్రతలు పూర్తిగా వైఫల్యం చెందాయన్నారు. దళితులపై దాడులు జరుగుతున్నాయని, ఇప్పటికైనా ప్రభుత్వం తమ తీరు మార్చుకోకుంటే ప్రజలే బుద్ధి చెప్పే రోజులు వస్తాయన్నారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ కన్వీనర్ నరసింహులురెడ్డి, లీగల్ సెల్ న్యాయవాదులు సీహెచ్ శ్రీనివాసులురెడ్డి, బి.చెంచురెడ్డి, బాలకృష్ణ, మల్లికార్జున, నేతలు శ్రీధర్‌రెడ్డి, నందగోపాల్‌రెడ్డి, ఉన్నారు.

సీపీఎం నేతల ర్యాలీ



తోటపల్లిగూడూరు: సీపీఎం సమైక్యత మతసామరస్య, దేశ సమగ్రత పరిరక్షణ ర్యాలీని స్థానిక పోలీస్ స్టేషన్ సెంటర్ నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా కరపత్రాలను అందజేశారు. జిల్లా కమిటీ సభ్యురాలు దుగ్గిరాల అన్నపూర్ణమ్మ, బండి శౌరి, కొండయ్య, రాధయ్య, రమణమ్మ, పరశురామయ్య, వెంకటసుబ్బయ్య, జానకయ్య తదితరులు పాల్గొన్నారు.

జొన్నవాడ ఆలయ ఆవరణలో వ్యక్తి మృతి

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: మండలంలోని జొన్నవాడ ఆలయ ఆవరణలో శనివారం అర్ధరాత్రి ఓ వ్యక్తి మృతిచెందారు. స్థానికుల కథనం మేరకు.. తోటపల్లిగూడూరు మండలానికి చెందిన రామచంద్రయ్య (58) గత 20 ఏళ్లుగా గ్రామంలోని పాత గిరిజన కాలనీలో నివాసం ఉంటున్నారు. శనివారం అర్ధరాత్రి ఆలయ ఆవరణలో ఉండగా ఒక్కసారిగా కుప్పకూలిపోయారు. స్థానికులు దగ్గర్లోని పీహెచ్‌సీకి తరలించారు. పరీక్షించిన డాక్టర్లు గుండెపోటుతో మృతిచెందారని తెలిపారు. మృతుడికి భార్య, పిల్లలు ఎవరూ లేరు. బంధువులు అంత్యక్రియలు పూర్తి చేశారు. దీనిపై ఎలాంటి కేసు నమోదు కాలేదు.

చెట్టుపై నుంచి పడి వ్యక్తి మృతి

నెల్లూరు(క్రైమ్): చెట్టుపై నుంచి టెంకాయలను దించుతుండగా ప్రమాదవశాత్తు కింద పడి వ్యక్తి మృతిచెందాడు. పోలీసుల సమాచారం మేరకు.. కొండాయపాళెం నక్కలగుంటకు చెందిన కాటయ్య(37), చెంగమ్మ దంపతులకు వరుణ్ సంతానం. భార్యభర్తలు కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. గత కొంతకాలంగా కాటయ్య నగరానికి చెందిన మీరాబాయి వద్ద టెంకాయ చెట్ల నుంచి కాయలు దించి పీచు తీసే పనులకు వెళ్తున్నారు. ఈ క్రమంలో ఆదివారం గోపాల్ అనే వ్యక్తి కాటయ్య వద్దకు వచ్చి బీవీనగర్ ఉమ్మారెడ్డిగుంటల్లోని తన చెట్ల నుంచి టెంకాయలు దించేందుకు రావాలని కోరారు. దీంతో ఆయన గోపాల్ వెంట వెళ్లారు. కాటయ్య చెట్టుపై నుంచి టెంకాయలు దించుతుండగా ప్రమాదశవాత్తు కిందపడడంతో తీవ్రగాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం జీజీహెచ్‌కు తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే ఆయన మృతిచెందాడని నిర్ధారించారు. విషయం తెలుసుకున్న చెంగమ్మ తన కుమారునితో ఆస్పత్రికి చేరుకుని విగతజీవిగా ఉన్న భర్తను చూసి కన్నీటి పర్యంతమైంది. ఈ మేరకు ఆమె వేదాయపాళెం పోలీసులకు ఫిర్యాదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్చురీకి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నేత్రపర్వంగా రథోత్సవం



రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: జొన్నవాడలోని మల్లికార్జున సమేత కామాక్షితాయి దేవస్థానంలో వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం రథోత్సవ సంబరం నేత్రపర్వంగా సాగింది. ఉదయం స్వామి, అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించి విశేష పూజలు జరిపారు. అనంతరం ఆదిదంపతులను రథంపై కొలువుదీర్చారు. వేలాది భక్తులు, ఆలయ సిబ్బంది రథాన్ని లాగుతూ కామాక్షితాయి నామస్మరణ చేశారు. భక్తులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా ఈఓ శ్రీనివాసులురెడ్డి ఏర్పాట్లను పర్యవేక్షించారు.

కనులపండువగా పుష్పయాగం



పొదలకూరు: పట్టణంలోని శ్రీలక్ష్మీ గోదా సమేత వెంకటేశ్వరస్వామి దేవస్థాన వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా పుష్పయాగాన్ని వేడుకగా నిర్వహించారు. మహాపూర్ణాహుతి, ధ్వజావరోహణం తదితరాలను విశేషంగా జరిపారు. ఉభయకర్తలుగా అన్నం లక్ష్మీనారాయణ, లక్ష్మి దంపతులు వ్యవహరించారు. బ్రహ్మోత్సవాల్లో చివరి రోజు ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. ఉభయకర్తలుగా రాచపూడి వెంకటరమణయ్య, కవిత దంపతులు వ్యవహరించారు.

కంది పంట సాగుకు అనుకూలం



సాగులో ఉన్న కంది పంట (ఫైల్)

- అంతర పంటలుగా మినుము, పెసర

పొదలకూరు: ప్రస్తుత వాతావరణం కంది పంట సాగుకు అనుకూలంగా ఉంటుందని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు. పొదలకూరు ప్రాంతంలో తరచూ కురుస్తున్న వర్షంతో నేలలో తేమశాతం ఉండటంతో ఖరీఫ్‌లో కంది సాగును చేపట్టొచ్చని పేర్కొంటున్నారు. మండలంలో మెట్ట పొలాలు అధికంగా ఉండటంతో కందితో పాటు రబీ సీజన్లో మినుము, పచ్చిశనగ, పెసర పంటలను సాగుచేస్తుంటారు. అయితే ప్రస్తుత వాతావరణ పరిస్థితులకు కంది అనుకూలంగా ఉంటుందని వెల్లడిస్తున్నారు.

కందిని అంతరపంటగా వేయాలి

పెసర, మినుము, పచ్చిశనగ పంటల్లో అంతర పంటగా కందిని సాగు చేస్తే అధిక వర్షాలు కురిసి పంటలన్నీ దెబ్బతిన్నా కంది చేతికి అంది, రైతులు నష్టాలను పూడ్చుకునేందుకు అవకాశం ఉంటుంది. ఒకే పొలంలో ఖరీఫ్‌లో కంది, రబీలో పెసర, మినుము పంటలను సాగు చేసుకునేందుకు వీలుంటుంది. రైతుకు ఒక ఎకరాపై నికర ఆదాయం పెరుగుతుంది.

విత్తనాలు విత్తే విధానం

కంది సాగు చేసే రైతులు వరుస, వరుసకు నాలుగు మీటర్ల ఎడమ ఉండేలా విత్తనాలు విత్తాలి. అక్టోబర్, నవంబర్‌లో కురిసే వర్షాలకు కంది సాళ్ల మధ్య మినుము, పెసర, పచ్చిశనగ పంటలను సాగు చేసుకునేందుకు అవకాశం ఉంటుంది. కందిని ఏకపంటగా కూడా విత్తుకోవచ్చు. వరుస, వరుసకు మధ్య రెండు మీటర్ల ఎడమ ఉంటేలా చూసుకోవాలి.